క్లుప్తంగా

నేడు 'గడప గడపకూ మన ప్రభుత్వం'

పెద్దపప్పూరు: అమ్మలదిన్నె గ్రామంలో సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించనున్నారు. కార్యక్రమంలో మండలంలోని అధికారులు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు పాల్గొనాలని ఎమ్మెల్యే కార్యాలయవర్గాలు కోరాయి.

మహిళకు తీవ్ర గాయాలు

గుత్తి: గుత్తి ఆర్‌ఎస్‌లోని ఎస్సీ కాలనీలో ఆదివారం రాణి అనే మహిళ ప్రమాదవశాత్తు మిద్దెపై నుంచి జారి కింద పడటంతో తీవ్రంగా గాయపడింది. బాధితురాలు, పోలీసులు తెలిపిన మేరకు.. రాణి మిద్దెపై దుస్తులు ఆరవేస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు కాలు జారి మిద్దెపై నుంచి కింద పడింది. ప్రమాదంలో రాణి తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి ఆమెను స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

గడ్డివామి దగ్ధం



గార్లదిన్నె: కల్లూరు కొండ కిందకొట్టాలలో ఆదివారం ఓ రైతు కు చెందిన వరిగడ్డి వామి అగ్ని మంటల్లో పూర్తిగా కాలిపోయిన సంఘటన చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన మంజునాథ ఇటీవల పశువుల మేత కోసం 3 వేల వరిగడ్డి కట్టలు కొనుగోలు చేసి ఇంటి వద్ద వామి వేసుకున్నాడు. ఇంటి వద్ద ఎవరూ లేని సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు వామికి నిప్పు పెట్టడంతో కాలిబూడిదైంది. రూ.80 వేలు నష్టపోయినట్లు బాధితుడు వాపోయాడు.

బైరి నరేష్‌పై చర్యలు తీసుకోవాలి



ర్యాలీ నిర్వహిస్తున్న అయ్యప్ప మాలధారులు

తాడిపత్రి టౌన్ : అయ్యప్ప స్వామిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన భారత నాస్తిక సంఘం అధ్యక్షుడు బైరి నరేష్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని అయ్యప్ప మాలధారులు వీహెచ్‌పీ, బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం ఉదయం స్థానిక గాంధీ సర్కిల్ నుంచి సీబీరోడ్డు మీదుగా బైరి నరేష్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం మానవహారంగా ఏర్పడ్డారు. అనంతరం పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐ ధరణిబాబుకు వినతిపత్రం ఇచ్చారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న సీఐ చిన్నపెద్దయ్య

తాడిపత్రి టౌన్ : స్థానిక పుట్లూరు రోడ్డులోని దూదేకుల సేవా సంఘం కార్యాలయంలో ఆదివారం నూతన సంవత్సర క్యాలెండర్‌ను సేవా సంఘం చైర్మన్ నబీరసూల్‌తో కలసి రూరల్ సీఐ చిన్న పెద్దయ్య, సబ్‌జైలు ఎస్‌ఐ కరీంముల్లా ఆవిష్కరించారు. అనంతరం నూతన సంవత్సరం పురస్కరించుకుని కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో దూదేకుల సేవా సంఘం నాయకులు పాల్గొన్నారు.

భగవద్గీత పోటీలు



విజేతలతో సురేంద్రనాథ్, సభ్యులు

తాడిపత్రి టౌన్: స్థానిక మెయిన్ బజార్‌లోని కన్యకా పరమేశ్వరీదేవి ఆలయంలో ఆదివారం వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు భగవద్గీత పోటీలు నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు తలుపుల సురేంద్రనాథ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో 90 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వారిలో ఆరుగురు విద్యార్థులు ప్రతిభ కనపరచినట్లు సురేంద్రనాథ్ తెలిపారు. విజేతలకు సోమవారం బహుమతులు ఇస్తామన్నారు.

మొక్కజొన్న పంట ధ్వంసం

రాయదుర్గం రూరల్: దారి తగాదాతో దౌర్జన్యంగా మొక్కజొన్న పంటను తొలగించిన సంఘటన గ్రామదట్లలో చోటుచేసుకుంది. బాధిత రైతు ప్రహ్లాద రెడ్డి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. 3.76 ఎకరాల్లో నెల క్రితం మొక్కజొన్న పంట సాగు చేశాడు. దుక్కిదున్నడం , విత్తనం, ఎరువులు తదితర పంట సాగు కోసం ఎకరాకు రూ.20 వేలు ఖర్చు పెట్టాడు. జె.లక్ష్మి, ఆమె కుమారుడు జే.నాగరాజు దౌర్జన్యంతో నా పంటను తొలగించారని బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేశాడు.

జగనన్నతో సంక్షేమ రాజ్యం

• ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి

బుక్కరాయసముద్రం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డితో రాష్ట్రంలో సంక్షేమ రాజ్యం వచ్చిందని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి పేర్కొన్నారు. ఆదివారం ఎంపీడీఓ కార్యాలయంలో పెంచిన పింఛన్లు, కొత్తగా మంజూరైన వారికి పింఛన్ సొమ్ము అందించారు. ఎమ్మెల్యేతోపాటు వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ మేనిఫెస్టోను 99 శాతం అమలు చేయడంతో పాటు అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారని తెలిపారు. గ్రామాల్లో 1వ తేదీ రాగానే వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు వలంటీర్ల ద్వారా ఇంటి తలుపు తట్టి పింఛన్ అందిస్తున్నారన్నారు. ఎన్నికల హామీ మేరకు పింఛన్ సొమ్మును రూ.2,500 నుంచి ఈనెల నుంచి రూ.2,750కు పెంచారని తెలిపారు. జగనన్న చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమాన్ని ఓర్వలేక ప్రతిపక్ష పార్టీలు కుట్రలు పన్నుతున్నాయన్నారు. పైలా నరసింహయ్య మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి కుల మతాలకు అతీతంగా పథకాలు ప్రజలకు అందిస్తున్నారన్నారు. గతంలో పథకాలు జన్మభూమి కమిటీ సభ్యులు చెప్పిన వారికే అందేవని తెలిపారు. జగనన్న పాలనలో రాష్ట్రం సుభిక్షంగా ఉందన్నారు. అనంతరం కేక్ కట్ చేశారు. ఎంపీపీ సునీత, జెడ్పీటీసీ భాస్కర్, మేజర్ పంచాయతీ సర్పంచ్ పార్వతి, తహసీల్దార్ మోహన్‌కుమార్, ఎంపీడీఓ తేజోత్స్న, వైస్ ఎంపీపీ రామగోపాల్, మండల కన్వీనర్ అంకే నరేష్, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

గార్లదిన్నె: గార్లదిన్నె పంచాయతీ కార్యాలయంలో ఆదివారం పెంచిన పింఛన్లు పంపిణీ కార్యక్రమం అధికారులు ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా వైఎస్సార్‌సీపీ నాయకులు మాట్లాడుతూ వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సీఎంగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి ఇచ్చిన మాట ప్రకారం పింఛన్ సొమ్మును పెంచుతూ పోతున్నారన్నారు. ఇక నుంచి ప్రతి నెలా రూ.2750లు చొప్పున అందిస్తారన్నారు. ప్రభుత్వం మండలంలో కొత్తగా 315 మందికి పింఛన్లు మంజూరు చేసిందన్నారు. సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. సర్పంచు సుబ్బమ్మ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నరేంద్రరెడ్డి, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ నారాయణరెడ్డి, వైస్ ఎంపీపీ కుంచం రామ్‌మోహన్ రెడ్డి, ఎంపీటీసీ రామచంద్ర , జంబులదిన్నె సొసైటీ చైర్మన్ సుధాకర్ రెడ్డి, ఎంపీడీఓ విజయభాస్కర్, వైస్ సర్పంచు షేక్షావలి పాల్గొన్నారు.

గుంతకల్లుటౌన్: రాష్ట్రంలోని అవ్వతాతలు, వితంతువులు, దివ్యాంగుల ముఖాల్లో చిరునవ్వులు విరబూయించడమే ఏపీ సీఎం వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి లక్ష్యమని మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్.భవాని పేర్కొన్నారు. ఆదివారం 28వ వార్డు సచివాలయ ఆవరణలో పింఛన్‌ల పెంపు వారోత్సవాల్లో భాగంగా వైఎస్సార్ పెన్షన్ కానుక కింద అవ్వాతాతలకు పెంచిన ఫించన్ సొమ్ము రూ.2750 ను ఆమె అందజేశారు. పింఛన్‌దారులు సీఎం జగనన్నను నిండు మనస్సుతో ఆశీర్వదించాలని ఆమె కోరారు. మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ నైరుతిరెడ్డి తన వార్డులో పెంచిన పింఛన్ సొమ్మును లబ్ధిదారులకు అందజేశారు.

గుత్తి రూరల్: మండలంలోని గొందిపల్లిలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు నరసింహులు ఆధ్వర్యంలో పింఛన్‌దారులతో కలిసి కేక్ కట్ చేసి పంచిపెట్టారు. అనంతరం పెంచిన పింఛన్ రూ.2,750 నగదును లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్ మంజుల, వైఎస్సార్‌సీపీ నాయకులు చిన్న నాగిరెడ్డి, కదిరిరెడ్డి, ప్రభాకర్, పెద్ద నాగిరెడ్డి పాల్గొన్నారు.

గుత్తి: పెంచిన పింఛన్ల సొమ్మును లబ్ధిదారులకు వలంటీర్లు పంపిణీ చేశారు. మున్సిపల్ కౌన్సిలర్లు, వార్డు వాలంటీర్లు కలిసి ఇంటింటికి వెళ్లి పింఛన్ సొమ్మును ఒక్కొక్కరికీ రూ.2,750 చొప్పున మున్సిపాలిటీ వ్యాప్తంగా మొత్తం 4,009 మందికి అందించారు.

యాడికి: మండలంలో ఆదివారం మొదటి రోజే 80 శాతం పింఛన్ల పంపిణీ పూర్తయింది. మొత్తం 7,734 మంది లబ్ధిదారులు ఉండగా 6,145 మందికి పింఛన్లు పంపిణీ చేశారు. పింఛన్ల పంపిణీకి మరో ఆరు రోజుల పాటు అవకాశం ఉన్నట్లు ఎంపీడీఓ వెంకటేశ్వర్లు తెలిపారు. వేలిముద్రలు పడని వారికి ఓటీపీ విధానం ద్వారా పంపిణీ చేస్తున్నట్లు వివరించారు.

పుట్లూరు: ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీని అమలు చేస్తూ వృద్ధాప్య పింఛన్లను రూ.2750లకు పెంచడంపై పింఛన్‌దారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం మండలవ్యాప్తంగా పింఛన్ల పంపిణీ కార్యక్రమం పండుగ వాతావరణంలో నిర్వహించారు. తక్కళ్లపల్లి గ్రామ సచివాలయంలో సర్పంచ్ మహేశ్వరరెడ్డి పింఛన్‌దారులకు రూ.2750 చొప్పున వలంటీర్ల ఆధ్వర్యంలో పింఛన్లు పంపిణీ చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు కొండారెడ్డి, వెల్ఫేర్ అసిస్టెంట్ సాయి, వలంటీర్లు పాల్గొన్నారు.

పామిడి: మండలంలోని 11 సచివాలయాలకు సంబంధించి మంజూరైన 275 కొత్త పింఛన్ల పంపిణీని ఘనంగా నిర్వహించారు. ఆదివారం సచివాలయానికి 25 చొప్పున మంజూరైన పింఛన్ల పంపిణీ చేసినట్లు ఎంపీడీఓ ప్రభాకర్‌నాయక్ తెలిపారు. పీ కొండాపురంలో వైఎస్సార్‌సీపీ నేతలు సునిల్‌రెడ్డి, రంగనాయకులు, నీలూరులో సర్పంచ్ బెల్లాల ప్రమీలమ్మ పింఛన్ సొమ్ము లబ్ధిదారులకు అందించారు.



వృద్ధులకు సన్మానించి పెంచిన పింఛన్ సొమ్ము అందిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ భవాని



పెద్దవడుగూరులో పింఛన్ సొమ్ము పంపిణీ చేస్తున్న ఎంపీపీ శ్రీదేవి, సర్పంచ్ వరలక్ష్మి

పెద్దవడుగూరు : మండలంలోని ఆదివారం తొలి రోజే 83 శాతం ఫించన్ల ను పంపిణీ చేసినట్లు ఎంపీడీఓ కుళ్లాయిస్వామి తెలిపారు. ఉదయాన్నే మండలంలోని ప్రజా ప్రతినిధులు లబ్ధిదారుల వద్దకు వెళ్లి ప్రభుత్వం ఫించన్ల పెంపుపై అవగాహన కల్పిస్తూ వలంటీర్లతో ముందుకు సాగారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ భాస్కర్ రెడ్డి, ఎంపీపీ శ్రీదేవి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఎద్దుల శరభారెడ్డి, యువజన విభాగం మండల కన్వీనర్ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తాడిపత్రి టౌన్: పట్టణంలో ఆదివారం పెరిగిన పింఛన్ల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. వలంటీర్లు, కౌన్సిలర్లు పెరిగిన పింఛన్‌సొమ్మును లబ్ధిదారులకు అందజేశారు. మున్సిపాలిటీ పరిధిలో 10,096 మంది పింఛన్‌దారులుండగా ఆదివారం సాయంత్రం 5 గంటలకు 8,132 మందికి (80.55 శాతం) మున్సిపల్ ఇన్‌చార్జ్‌కమిషనర్ జబ్బార్‌మియా తెలిపారు.

సుబ్రహ్మణ్యేశ్వరుడికి ప్రత్యేక పూజలు



అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి

గార్లదిన్నె: కోటంక కొండల్లో వెలసిన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం ప్రధాన అర్చకుడు రామాచార్యులు స్వామిని ప్రత్యేకంగా అలంకరించి పూజ లు చేశారు. ఈసందర్భంగా చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. దీంతో ఆలయం వద్ద భక్తుల సందడి నెలకొంది. భక్తుల సౌకర్యార్థం ఆలయ కమిటీ సభ్యులు అన్నదానం నిర్వహించారు.

ఏపీటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎంఈఓ గురుప్రసాద్, ఉపాధ్యాయ సంఘం నేతలు

బుక్కరాయసముద్రం: స్థానిక ఎంఈఓ కార్యాలయ ఆవరణలో మండల విద్యా అధికారి గురుప్రసాద్ చేతులమీదుగా ఏపీటీఎఫ్ డైరీ, క్యాలెండర్‌ను ఆదివారం విడుదల చేశారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి సుభద్ర, రాష్ట్ర కౌన్సిలర్ సర్దార్‌వలి, నాయకులు అంజలీ దేవి, చితంబర్‌రెడ్డి, రామాంజిని, వన్నప్ప, హరిహరనాథ్, శ్రీనివాసులు, పవన్ కుమార్, బాబు, కలిముల్ల విజయలక్ష్మి, తిప్పేస్వామి, కుళ్లాయిబాబు, మల్లికార్జున స్వామి, నాగరాజు గౌడ్, సుదర్శనరెడ్డి, పాల్గొన్నారు.

బైక్‌పై నుంచి పడి యువకులకు గాయాలు

గుత్తి రూరల్: కరిడికొండ గ్రామ శివారులో శనివారం అర్ధరాత్రి బైక్ అదుపు తప్పి ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాలు.. కరిడికొండ గ్రామానికి చెందిన వేణుగోపాల్, కుమార్ అనే యువకులు నూతన సంవత్సరం సందర్భంగా బాట సుంకులమ్మ ఆలయంలో పూజలు చేసుకొని తిరిగి ఇంటికి వెళ్తుండగా బైక్ అదుపు తప్పి కిందపడ్డారు. గాయపడ్డ ఇద్దరిని స్నేహితులు గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

హెడ్ కానిస్టేబుల్ కు తీవ్ర గాయాలు

గుత్తి: పట్టణంలోని గాంధీ సర్కిల్ సమీపంలో బైక్‌పై నుంచి కిందపడి హెడ్ కానిస్టేబుల్ సాజాద్ బాషా తీవ్రంగా గాయపడ్డాడు. వివరాల్లోకి వెళితే శనివారం అర్ధరాత్రి సమయంలో నూతన సంవత్సరం సందర్భంగా విధులు నిర్వహించి పోలీసు స్టేషన్ వద్దకు బైక్‌లో సాజాద్ బాషా బయలు దేరాడు. అయితే బైక్ కొంత దూరం వచ్చాక అదుపు తప్పి కిందపడ్డాడు. తీవ్రంగా గాయపడిన అతడిని స్థానికులు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

వైకుంఠ ఏకాదశికి చింతల ఆలయం ముస్తాబు



బారికేడ్లను పరిశీలిస్తున్న ఆలయ చైర్మన్ బాణా నాగేశ్వరరెడ్డి, సభ్యులు

తాడిపత్రి టౌన్ : స్థానిక చింతల వెంకటరమణ స్వామి ఆలయంలో సోమవారం జరగనున్న వైకుంఠ ఏకాదశి పర్వదినానికి ఏర్పాటు పూర్తయ్యాయి. ఆలయాన్ని విద్యుత్ దీపాలు, రంగు,రంగుల పూలతో ముస్తాబు చేశారు. ఆలయ ఆవరణలోని ఆనంద పుష్కరణిలో (కోనేటి)లో వేంకటేశ్వర స్వామి విగ్రహాన్నిఏర్పాటు చేశారు. చింతల వెంకటరమణస్వామి అండాళ్ల అమ్మవార్ల దర్శనాల సమయంలో భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకోని ఆలయంతోపాటు ఆవరణమంతా బారికేడ్లు ఏర్పాటు చేశారు. ఆలయంలో ముగ్గుతో వేసిన శ్రీవారి పాదాలు, రంగు,రంగుపూలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సోమవారం తెల్లవారు జామున 2 గంటల నుంచి పూజలు ప్రారంభమవుతాయని, తెల్లవారు జామున 3 గంటల నుంచి భక్తులకు స్వామి దర్శనభాగ్యం కల్పించనున్నట్లు ఆలయ చైర్మన్ బాణా నాగేశ్వరరెడ్డి తెలిపారు. ఉదయం 8 గంటలకు స్వామి గ్రామోత్సవం నిర్వహిస్తామన్నారు. చింతల వెంకటరమణస్వామి ఆలయంలో సోమవారం స్వామిని దర్శించుకున్న ప్రతి భక్తుడికి తిరుపతి లడ్డూతోపాటు ,అన్నవరం సత్యనారాయణస్వామి ప్రసాదం పంపిణీ చేస్తామని తెలిపారు.

వైభవంగా అయ్యప్పస్వామి పడిపూజ



అయ్యప్పస్వామికి పూజ నిర్వహిస్తున్న దృశ్యం

పామిడి: పట్టణంలోని భోగేశ్వరాలయంలో అయ్యప్పస్వామి సేవాసమితి ఆధ్వర్యంలో ఆదివారం అయ్యప్పస్వామి పడిపూజ కార్యక్రమం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా స్వామి మండపాన్ని శోభాయమానంగా అలంకరించారు. గణపతి పూజ, గౌరీ, మహాలక్ష్మి పూజలు చేశారు. అయ్యప్ప విభూతి అభిషేకం, 18 మెట్ల పడిపూజ, ధాన్యలక్ష్మి పూజ నిర్వహించారు. అయ్యప్పస్వామి హోమం ఆచరించారు. ఈసందర్భంగా అయ్యప్ప మాలధారుల సంకీర్తనలతో ఆలయం మార్మోగింది. అనంతరం 2 వేల మందికి అన్నదానం చేశారు.

భక్తిశ్రద్ధలతో ఇరుముడి

గుత్తి: గుత్తి ఆర్‌ఎస్‌లోని అయ్యప్ప ఆలయంలో ఆదివారం అయ్యప్ప మాలాధారుల ఇరుముడి కార్యక్రమం ఘనంగా జరిగింది. ప్రత్యేక పూజల అనంతరం గురుస్వాములు అయ్యప్ప మాలధారులకు ఇరుముడి ధరింపజేశారు. ఇరుముడి కార్యక్రమాన్ని తిలకించడానికి భక్తులు భారీగా తరలివచ్చారు.

పంపనూరులో ప్రత్యేక పూజలు

ఆత్మకూరు: పంపనూరు సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. నూతన సంవత్సరం వేడుకల సందర్భంగా జిల్లా నలుమూలల నుంచి భక్తులు పెద్ద ఎత్తున పూజల్లో పాల్గొన్నారు. స్వామి మూలవిరాట్‌కు విశేష పూజలు చేశారు. అనంతరం పంచామృతాభిషేకాలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో రాహు కేతు హోమాలు చేశారు. మంజునాథ స్వామి, వరలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిగాయి.



అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వరుడు

వైద్య ఆవిష్కరణలకు నాంది కావాలి



కళాశాల ప్రిన్సిపాల్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న విద్యార్థులు

అనంతపురం సప్తగిరి సర్కిల్: నూతన సంవత్సరంలో వైద్య ఆవిష్కరణలకు నాంది కావాలని మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మైరెడ్డి నీరజ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక మెడికల్ కళాశాలలో నూతన సంవత్సర వేడుకలను నిర్వహించారు. వైద్య విద్యార్థులు ప్రిన్సిపాల్‌కు శుభాకాంక్షలను తెలిపారు. కార్యక్రమంలో మెడికల్, పీజీ విద్యార్థులు హాజరయ్యారు.

ఘనంగా నూతన సంవత్సర వేడుకలు





కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే వైవీఆర్, చిత్రంలో డీఎస్పీ నరసింగప్ప,క్యాలెండర్ విడుదల చేస్తున్న ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, ఆలూరు సాంబశివారెడ్డి

గుంతకల్లు టౌన్: నూతన సంవత్సర వేడుకలు గుంతకల్లులో ఆదివారం ఘనంగా జరిగాయి. ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్.భవాని, వైస్ చైర్‌పర్సన్లు నైరుతిరెడ్డి, మైమూన్ నివాసాలు, ప్రభుత్వ కార్యాలయాల వద్ద సందడి నెలకొంది. ఎమ్మెల్యే వైవీఆర్ కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే, చైర్‌పర్సన్లను ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అధికారులు, ప్రజాసంఘాల నాయకులు పెద్దసంఖ్యలో కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న, డీఎస్పీ నరసింగప్ప, తహసీల్దార్ రాము, వివిధ శాఖల అధికారులు, గుత్తి, పామిడి మండలాల అధికారులు, సిబ్బంది ఎమ్మెల్యేను కలిసి పుష్పగుచ్ఛాల్ని అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. న్యూఇయర్ సందర్భంగా పట్టణంలోని శ్రీవేంకటేశ్వరస్వామి, పాతగుంతకల్లు రామలింగేశ్వరస్వామి, శ్రీకన్యకాపరమేశ్వరి, దుర్గాభవాని, అయ్యప్ప స్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

సుఖసంతోషాలతో ఉండాలి

శింగనమల: నియోజకవర్గంలోని ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి కోరారు. ఆదివారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో కేక్ కట్ చేసి, నూతన సంవత్సర వేడుకలు జరుపుకున్నారు. నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు తరలివచ్చి ఎమ్మెల్యే దంపతులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈసందర్భంగా వారు వెదురు మొక్కలు అందజేశారు.

పామిడి : స్థానిక సీఎస్ఐ చర్చిలో నిర్వహించిన నూతన సంవత్సర వేడుకల్లో సీఎస్ఐ గుత్తి డివిజనల్ చైర్మన్ పాస్టర్ రెవరెండ్ జీ డేవిడ్‌నాయక్ క్రైస్తవులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈసందర్భంగా ఆయన క్రైస్తవులకు రొట్టె, ద్రాక్షరసం ఇచ్చి దేవుని ప్రభురాత్రి భోజన ప్రత్యేక ప్రార్థనలు చేశారు. చర్చీ సెక్రటరీ పరదేశి విజయశేఖర్‌రాజు, సభ్యులు పాల్గొన్నారు.

గార్లదిన్నె: వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నరేంద్ర రెడ్డి, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ నారాయణరెడ్డి, మాజీ ఎంపీపీ ప్రదీప్‌రెడ్డి నివాసంలో నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ సంబరాలు చేసుకున్నారు. ముకుందాపురంలో వైఎస్సార్‌సీపీ నేత పరమేశ్వర రెడ్డి వృద్ధులు, వికలాంగులు, పేదలకు దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు. పాలిఏకరి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ పరంధామ, వైఎస్సార్‌సీపీ నాయకులు గురుప్రసాద్, హనుమంతరెడ్డి, పీసీ చైర్మన్ నారాయణ,ఓబిరెడ్డి, సదాశివరెడ్డి, గంగాధర్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

గుత్తి: మాజీ ఎంపీపీ కోనా మురళీధర్‌రెడ్డి స్వగృహంలో నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. వైఎస్సార్ సీపీ సీనియర్ నేత ఆముదాల గిరిధర్, పగడాల శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శి గురుప్రసాద్ యాదవ్, మున్సిపల్ వైస్ చైర్మన్ బిందె వరలక్ష్మి, మాజీ ఎమ్మెల్యే కొట్రికె మధుసూదన్ గుప్తా, జిల్లా నేత క్రషర్ మధుసూదన్‌రెడ్డి, పోలీసు స్టేషన్, గాంధీ సర్కిల్లో సీఐ వెంకటరామిరెడ్డి కేక్‌లు కట్ చేశారు. గుత్తిలోని బైబిల్ మిషన్ చర్చి(స్వస్థత శాల)లో భారీ కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా బైబిల్ మిషన్ చర్చి పాస్టర్ రెవరెండ్ అద్భుత కుమార్, మణి కుమారి దంపతులతో పాటు కుటుంబ సభ్యులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

గుంతకల్లుటౌన్: హౌసింగ్‌బోర్డు శ్రీవివేకానంద పార్క్‌లో గుంతకల్లు రెవెన్యూ డివిజన్ తహసిల్దార్‌లు, ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో నూతన ఆంగ్ల సంవత్సర వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఆర్‌డీఓ జె.రవీంద్ర మానసిక దివ్యాంగులైన పిల్లల చేత కేక్‌ను కట్ చేసి వారికి స్వీట్లు పంచిపెట్టారు. అనంతరం హోలీక్రాస్ సోషియల్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో నడుస్తున్న మానసిక దివ్యాంగులైన 42 మంది చిన్నారులకు ఆర్‌డీఓ చేతుల మీదుగా దుస్తులు అందజేశారు. తహసీల్దార్లు బి.రాము, మహబూబ్‌బాషా, సునీతబాయి,ఈరమ్మ, అలెగ్జాండర్, బ్రహ్మయ్య, అనిల్‌కుమార్, యు.ఆదినారాయణ, డీటీలు, ఆర్‌ఐలు, వీఆర్‌ఓలు, సిబ్బంది పాల్గొన్నారు.

పెద్దవడుగూరు: మండల్యవ్యాప్తంగా నూతన సంవత్సరం వేడుకలను ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. ఐఎస్ఈసీ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పేట శివాలయం, చెన్న కేశవస్వామి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక కాశిరెడ్డి నాయన ఆలయం వద్ద గ్రామపెద్దలు పెద్ద ఎత్తున అన్నదానం నిర్వహించారు.

తాడిపత్రి టౌన్: స్థానిక సుంకులమ్మపాలెంలోని ఆర్‌సీఎం చర్చి ఆవరణలో ఆదివారం ఆటల పోటీలు జరిగాయి. మహిళలు, పిల్లలకు ఖోఖో, కబడ్డీ, వాలీబాల్,రన్నింగ్, మ్యూజికల్ చైర్ పోటీలు నిర్వహించారు. విజేతలకు ఫాదర్స్ ప్రోత్సాహక బహుమతులను పంపిణీ చేశారు. ఉదయం చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి కేక్ కట్ చేశారు.

గుత్తి రూరల్: మండల వ్యాప్తంగా ఆదివారం నూతన సంవత్సర వేడుకలు సంబరాలు అంబరాన్నంటాయి. తొండపాడు బొలికొండ రంగనాథ స్వామి, బాచుపల్లి బాట సుంకలమ్మ, సేవాగఢ్‌లోని సేవాలాల్ మహరాజ్ ఆలయంలో యువకులు, విద్యార్థులు పూజలు చేశారు. ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ విశాలాక్షి, మండల కన్వీనర్ గోవర్ధన్‌రెడ్డిలను ఊబిచెర్ల గ్రామస్తులు సన్మానించారు.

యాడికి: మండలంలో ఆదివారం నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలో ఎంపీపీ బొంబాయి ఉమాదేవి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొంబాయి రమేష్ నాయుడు దంపతులు, ఉప సర్పంచు కాసా చంద్రమోహన్‌కు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి శుభాకాంక్షలు తెలిపారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత బాలా రమేష్ బాబును, భోగాల కట్టలోజెడ్పీటీసీ మాజీ సభ్యుడు వెంకటరామిరెడ్డికి నాయకులు, కార్యకర్తలు పూలమాలలు, శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు.

ఘనంగా ధనుర్మాస పూజలు

పామిడి: పట్టణంలోని కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఆదివారం ధనుర్మాస పూజలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా గీత మహత్యం, సూర్యాష్టకం, శాంతిమంత్రం పఠించారు. కృష్ణ అండాల్ అష్టోత్తర పూజలు చేశారు. ఆలయ అర్చకుడు అన్నవజ్జల రఘునాథ్‌శర్మ సౌజన్యంతో భక్తులకు అల్పాహారం అందించారు.

వేర్వేరు సమయాల్లో రెండు రోడ్డు ప్రమాదాలు

ఆత్మకూరు: మండల కేంద్రం సమీపంలో నూతన సంవత్సరం మొదటి రోజున ఆదివారం వేర్వేరు సమయాల్లో రెండు రోడ్డు ప్రమాదాలు జరిగాయి. కళ్యాణదుర్గానికి చెందిన ఇద్దరు వ్యక్తులు, ఓ మహిళ కారులో అనంతపురం నుంచి కళ్యాణదుర్గం వెళ్తుండగా, ఉన్నఫళంగా కారు బోల్తాపడింది. కారులో ప్రయాణిస్తున్న ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వారిని ఆస్పత్రికి తరలించారు. మరో పది నిమిషాలకు ఆత్మకూరుసమీపంలో ఓ దాబా వద్ద ఆత్మకూరుకు చెందిన డిష్ శివారెడ్డి స్కూటీపై వెళ్తుండగా, కళ్యాణదుర్గం వెళ్తున్న కర్ణాటక బస్సు ఢీకొనింది. స్థానికులు అతన్ని ఆస్పత్రికి చికిత్సనిమిత్తం తరలించారు. తరచూ బైపాస్ వెంట రోడ్డు ప్రమాదాలు జరుగుతుండడంతో స్థానికులు ఆందోళన చేశారు. పోలీసులు అక్కడికి చేరుకొని నిరసనకారులకు సర్దిచెప్పారు.